క్లుప్తంగా

సమన్వయంతో విధులు నిర్వర్తించాలి



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి చంద్రజీవన్

జి.సిగడాం: గ్రామస్థాయిలో విధులు నిర్వహిస్తున్న ప్రతి అధికారి సమన్వయంతో విధులు నిర్వహించాలని మండల పరిషత్ ప్రత్యేకాధికారి పి.చంద్రజీవన్ సూచించారు. గురువారం జి.సిగడాం ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ మార్పుల నేపథ్యంలో వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి పంచాయతీలో పక్కాగా పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. ఎక్కడా వాడుక నీరు నిల్వ లేకుండా చూడాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉందన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీడీఓ గుంటముక్కల రామకృష్ణారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న ఏడీఏ శ్రీనివాసరావు

రణస్థలం: విషతుల్యమౌతున్న పంట భూముల నుంచి రక్షణగా ప్రకృతి వ్యవసాయం అవలంబించేలా రైతులను ప్రోత్సహించాలని రణస్థలం ఏడీఏ వి.శ్రీనివాసరావు అన్నారు. లావేరు మండలం తాళ్లవలస రైతు సేవా కేంద్రంలో లావేరు, రణస్థలం మండలాల సచివాలయ వ్యవసాయ, ఉద్యానవన సహాయకులకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ గురువారం నిర్వహించారు. ఆత్మ డీపీడీ వెంకటేశ్వరరావు, ఎన్ఎఫ్ఏ శివకృష్ణ, సంజీవరావు, జిల్లా ట్రైనింగ్ టీం సభ్యులు శిక్షణ ఇచ్చారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం ఆచరించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు మహేష్‌నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజరాజేశ్వరీ దేవికి క్షీరాభిషేకం



శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని గుడివీధిలో ఉమారుద్ర కోటేశ్వర స్వామి ఆలయంలో ఆషాఢ అమావాస్య పురస్కరించుకొని రాజరాజేశ్వరీ దేవికి గురువారం క్షీరాభిషేకాలు జరిగాయి. అంతకుముందు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఫుట్‌బాల్ క్రీడాకారిణికి అభినందనలు



పుష్పలతకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారిణి రుప్ప పుష్పలతను జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ముని శ్రీనివాసరావు గురువారం అభినందించారు. ఉత్తరప్రదేశ్‌లోని నోయిడా వేదికగా ఇటీవల జరిగిన జిజియాబాయి జాతీయ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున పుష్పలత ప్రాతినిధ్యం వహించింది. ఈమె స్వగ్రామం నరసన్నపేట మండలం జమ్ము . తల్లిదండ్రులు అప్పలస్వామి, సుశీల. పుష్పలత నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ఫైనలియర్ చదువుతోంది. జిజియాబాయి నేషనల్ ఫుట్‌బాల్ టోర్నీలో విశేషంగా రాణించి సెలక్టర్ల మన్ననలు అందుకుంది. గురువారం సంఘ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పుష్పలతకు మెరిట్ సర్టిఫికెట్ అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ సంయుక్త కార్యదర్శి కె.నవీన్ పాల్గొన్నారు.

బాబాకు ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న బాబా

జి.సిగడాం: ఆనందపురంలో షిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు హాజరై బాబాను దర్శించుకున్నారు. అనంతరం నారాయణ సేవ నిర్వహించారు. పెంట, జాడ, దేవరవలస, గెడ్డకంచరాం, ఎందువ, చంద్రయ్యపేట గ్రామాల్లోనూ బాబా ఆలయంల్లో ప్రత్యేక పూజలు, వ్రతాలు జరిగాయి.

శ్రావణం.. శుభకరం



పొట్టిశ్రీరాములు పెద్దమార్కెట్లో పూల అమ్మకాలు

- నేటి నుంచి శ్రావణమాసం ఆరంభం
- పూజలకు సిద్ధమవుతున్న ఆలయాలు
- వరలక్ష్మీ వ్రతాల సన్నాహాల్లో మహిళలు
- మార్కెట్‌లో పెరగనున్న కొనుగోళ్లు

శ్రీకాకుళం కల్చరల్: ఇంటింటా శోభను తీసుకొచ్చే.. శుభాలకు నిలయమైన శ్రావణ మాసం వచ్చేసింది. శుభకార్యాలు, శుభ ముహూర్తాలు, వ్రతాలు, పూజలతో ఈ నెల మొత్తం సందడి వాతావరణం నెలకొంటుంది. ముఖ్యంగా ఈ మాసంలో వేచ్చే శుక్రవారాలు, మంగళవారాలకు ప్రత్యేకత ఉంటుంది. ఈ ఏడాది శ్రావణంలో 5 శుక్రవారాలు, 4 మంగళవారాలు వస్తున్నాయి. నేటి మొదటి శుక్రవారం సందర్భంగా నగర పరిధిలోని అమ్మవారి ఆలయాలు, దేవీ పీఠాలలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.



పూజా సామగ్రి



వరలక్ష్మి వ్రతం కోసం అమ్మవారి బొమ్మ

26 నుంచి మంచి ముహూర్తాలు..

ఆషాఢమాసం ముగియడంతో శ్రావణ మాసంలో మంచి శుభ ముహూర్తాలు ఉన్నాయని పురోహితులు చెబుతున్నారు. జూలై 26 నుంచి ఆగస్టు 18 వరకు సుముహూర్తాలు ఉన్నాయి. జూలై 26, 29, 30, 31, ఆగస్టు 1, 3, 6, 7, 8, 9, 10, 13, 14, 17, 18 తేదీలలో పెళ్లి ముహూర్తాలు ఉన్నాయి.

పూజా సామగ్రికి డిమాండ్..

శ్రావణమాసం అంటే మహాలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు, వ్రతాలు, నోములు జరుగుతాయి. వీటి కోసం పూజా సామగ్రి అవసరం కావడంతో మార్కెట్లు కిటకిటలాడుతున్నాయి. ప్రతిష్టాత్మకంగా నిర్వహించే వరలక్ష్మీ వ్రతం సౌభాగ్యాన్ని ఇస్తుందని మహిళల నమ్మకం. దీనిని ఘనంగా నిర్వహించేందుకు ముఖ్యంగా అమ్మవారిని అలంకరించేందుకు ఆభరణాలు కొనుగోలు చేస్తుంటారు.

పూలకు గిరాకీ..

వరలక్ష్మీదేవికి విశేష పూజలు, కుంకుమార్చనలు నిర్వహిస్తుంటారు. మహిళలు సామూహికంగా వ్రతాలు ఆచరిస్తుంటారు. ఇందుకోసం పూలు ఎక్కువగా అవసరమవుతాయి. అందుకే వీటికి గిరాకీ. చేమంతులు కేజీ రూ.800, గులాబీలు రూ.600, బంతిపూలు రూ.500, విరజాజులు రూ.వెయ్యి, కొబ్బరికాయలు రూ.30, అరటిపళ్ల పెడ రూ.80 వరకు ధర పలుకుతుంటాయి.

వ్రతాలకు ప్రత్యేకం..



శ్రావణమాసంలో అమ్మవారి బొమ్మలు పెట్టి పూజలు చేస్తుంటారు. ఇందుకోసం కొత్త కొత్త విగ్రహాలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. ఈ నెలలో పూజా సామగ్రి విక్రయాలు బాగుంటాయి.

– సాయినాథ్, అమ్మకందారు, పెట్రోమాక్స్‌వీధి

అమ్మవారికి ప్రీతికర మాసం..



శ్రావణమాసం అమ్మవారికి ప్రీతికరమాసం. మహిళలను సుమంగళిగా దీవించే అమ్మవారి కోసం కుంకుమ పూజలు, వ్రతాలు జరుగుతాయి. ఆలయంలో ప్రతి శుక్రవారం కుంకుమ పూజలు చేస్తాం.

– మోదుకూరి కిరణ్‌శర్మ, సంతోషిమాత ఆలయ అర్చకులు, శ్రీకాకుళం

సూపర్‌సిక్స్ అంతా మాయ



చింతాడలో ఇంటింటికీ వెళ్లి బాబు మోసాలను వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

శ్రీకాకుళం రూరల్: చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన సూపర్‌సిక్స్ అంతా మాయేనని, మేనిఫెస్టోను ఆ పార్టీ వెబ్‌సైట్‌లో చూద్దామన్నా కనిపించకుండా మాయం చేశారని వైఎస్సార్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చిట్టి జనార్దనరావు అన్నారు. గురువారం శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలోని చింతాడ గ్రామంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా క్యూఆర్ కోడ్ పత్రాలతో ఇంటింటికీ వెళ్లారు. గ్రామ ఇన్‌చార్జులు బోర చిన్నంనాయుడు, బోర రమణయ్యలు కలిసి గ్రామస్తులచే స్కాన్ చేయించి కూటమి ప్రభుత్వ మోసాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలను మోసం చేయడం, ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కడం చంద్రబాబు నైజమన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు అంబటి శ్రీనివాసరావు, గేదెల పురుషోత్తం, మూకళ్ల తాతబాబు, బొడ్డేపల్లి రమేష్, దుంపల శ్యామలరావు, కంచు వసంత, ఎచ్చెర్ల శ్రీధర్, చిట్టి లక్ష్మణరావు, బోర కృష్ణవేణి, గుండ లక్ష్మణరావు, కుంచాల భాస్కరరావు, బోర నర్సునాయుడు, చింతాడ వెంకటరమణ, సాధు కామేశ్వరరావు, గుండ హరేష్, సరికి రామారావు, బాణ శ్రీను, బలగ మోహన్, అల్లు అనిల్, యువరాజు, ముచ్చ జగన్, ప్రకాశ్, పల్లా లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు విస్మరించడమే బాబు నైజం



కొవ్వాడలో చంద్రబాబు మోసాలు వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రణస్థలం: రాష్ట్రంలో మోసపూరిత పాలన సాగుతోందని, హామీలు గుప్పించడం అమలు చేయకపోవడం చంద్రబాబు నైజమని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు అన్నారు. కొవ్వాడ మత్స్యలేశంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజలకు వీడియో రూపంలో చంద్రబాబు మోసాలను వివరించారు. మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి గత ప్రభుత్వంలో అందించిన సంక్షేమాన్ని మరోసారి గుర్తు చేశారు. ఈ ఏడాది కాలంలో ప్రజలకు అందాల్సిన సంక్షేమ పథకాలు అమలు చేయకుండా చంద్రబాబు మోసం చేశారని విమర్శించారు. పథకాలు అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మాలని చెబుతున్న కూటమి నాయకులు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినప్పుడు తెలియదా అని విమర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి పిన్నింటి సత్యంనాయుడు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు నేతల కృష్ణ, నాయకులు అల్లిపల్లి అప్పన్న, గొర్లె రాధాకృష్ణ, జక్కంపూడి అచ్చిబాబు, పిల్ల తాత, చీకటి ఎర్రయ్య, ఉప్పాడ అప్పన్న, అల్లిపల్లి రాముడు, మైలపల్లి పట్టయ్య, జగ్గులు, గురువులు, బడి రాంబాబు, మల్లిబాబు, సూరాడ కాశోడు, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ పితామహుడు అయ్యంకి



బలగ హడ్కోకాలనీ గ్రంథాలయంలో అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం



లావేరు శాఖా గ్రంథాలయంలో నివాళి అర్పిస్తున్న గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు

శ్రీకాకుళం అర్బన్/రణస్థలం: గ్రంథాలయ పితామహుడు పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య అని బలగ హడ్కో కాలనీ గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేన అన్నారు. వెంకటరమణయ్య 135వ జయంతి సందర్భంగా బలగ హడ్కోకాలనీలో గల శాఖా గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సహాయకురాలు కె.అనిత, పాఠకులు పాల్గొన్నారు. లావేరు శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వ్యాసరచన పోటీల విజేతలు పి.సూర్యనారాయణ, ఎస్.నీలిమ, కె.నాగరాజులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సహాయకుడు టి.వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోసగించడంలో చంద్రబాబు సిద్ధహస్తుడు



టి.కామేశ్వరి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): హామీల పేరిట ప్రజలను మోసగించడంలో సీఎం చంద్రబాబు సిద్ధహస్తుడని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి టి.కామేశ్వరి అన్నారు. గురువారం ఆమె 'సాక్షి'తో మాట్లాడుతూ విజయనగరం జిల్లాలో ఓ సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ఆడబిడ్డ నిధి కింద డబ్బులు ఇవ్వాలంటే రాష్ట్రాన్ని అమ్మేయాలని వ్యాఖ్యానించడం బాధాకరమని పేర్కొన్నారు. మోసపూరిత హామీలు ఇచ్చి మహిళలను మోసం చేశారని మండిపడ్డారు. గతంలోనూ డ్వాక్రా మహిళలకు పసుపు కుంకుమ పేరుతో చివరికి పట్టుమని పది రూపాయలు కూడా ఖాతాల్లో వేయకుండా మోసగించారని గుర్తు చేశారు.

గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ గంగరాజు

గార: గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ సీహెచ్ గంగరాజు అన్నారు. గురువారం వాడాడ ప్రాథమికోన్నత పాఠశాలలో సంకల్పం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళల పట్ల జరుగుతున్న నేరాలపై తెలుసుకుని తల్లిదండ్రులకూ తెలియజేయాలన్నారు. చదువుతో పాటు క్రీడలపైనా దృష్టి సారించాలన్నారు. డ్రగ్స్, మత్తు పదార్థాలకు బానిసగా మారితే జీవితం నాశనం అవుతుందన్నారు. సైబర్ నేరాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

రణస్థలం: లావేరు మండలం బుడుమూరు గ్రామానికి చెందిన ఓ యువతి అదృశ్యమైంది. ఈ నెల 15న విజయనగరంలో ఉద్యోగం నిమిత్తం వెళుతున్నానని ఇంటిలో చెప్పి తిరిగి రాలేదేని, ఎటువంటి సమాచారం ఇవ్వలేదని గురువారం యువతి తల్లి లావేరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై జి.లక్ష్మణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మురపాకను మండల కేంద్రం చేయాలి

రణస్థలం: ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నూతనంగా మండలాల పునర్విభజనపై క్యాబినెట్ సబ్ కమిటీ వేసిన నేపథ్యంలో మురపాక కేంద్రంగా నూతన మండలాన్ని ఏర్పాటు చేయాలని స్థానిక శ్రీ వివేకానంద యూత్ సొసైటీ అధ్యక్షుడు బాలి శ్రీనివాసనాయుడు కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 1989లో మురపాకను మండలంగా ఏర్పాటు చేస్తూ గెజిట్ కూడా వచ్చిందని, రాజకీయ కారణాలతో ఏర్పడలేదని గుర్తు చేశారు. మురపాక పరిసర పంచాయతీల తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, ప్రజలు, వ్యాపార వర్గాలు, ఉద్యోగ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక యువత సహాయంతో మండల కేంద్రం కోసం ఉద్యమిస్తామని పేర్కొన్నారు. గతంలోనూ పోస్ట్ కార్డు ఉద్యమం చేపట్టామని, త్వరలో కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.

తిరోగమనంలో రాష్ట్రాభివృద్ధి



కొయ్యాంలో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

- బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీలో మాజీ ఎమ్మెల్యే కిరణ్

రణస్థలం: ప్రజలకు అందించే సంక్షేమ పథకాలకు చంద్రబాబు తూట్లు పొడవడంతో రాష్ట్రంలోని పేదల బాధలు వర్ణనాతీతమని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. ఎచ్చెర్ల మండలం కొయ్యాం గ్రామంలో గురువారం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను ప్రజలకు వీడియో రూపంలో వివరించారు. చంద్రబాబు 142 హామీలు ఇచ్చారని, వాటిని నమ్మిన సామాన్య ప్రజానీకం గెలిపిస్తే అధికారంలోకి వచ్చాక అమలు చేయకపోవడం దారుణమన్నారు. హామీలు బుట్టదాఖలు చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని అన్నారు. ప్రజలకు సంక్షేమం అందక, గ్రామాలు అభివృద్ధి చెందక రాష్ట్రం తిరోగమనంలో పయనిస్తోందన్నారు. సంపద సృష్టిస్తానని చెప్పిన చంద్రబాబు కూటమి నాయకుల వరకే సంపద సృష్టిస్తున్నారని ఎద్దేవా చేశారు. అనంతరం ధర్మవరం, బడివానిపేట, డి.మత్స్యలేశం గ్రామాల్లోనూ బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సనపల నారాయణరావు, మండల పార్టీ అధ్యక్షుడు బోర సాయిరాం రెడ్డి, వైస్ ఎంపీపీ జరుగుళ్ల శంకర్, జిల్లా పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడు నేతింటి నీలమప్పడు, మండల పరిషత్ విప్ బగ్గు రాజారావు, నాయకులు నక్క కృష్ణమూర్తి, బోర గోవింద రెడ్డి, దుంప ఈశ్వరరెడ్డి, పాత్రుని రమణ, దుంప చిన్నారెడ్డి, అల్లు కన్నబాబు, కారి తాతరావు, శ్రీరపు శ్రీరామ్‌మూర్తి తదితరులు ఉన్నారు.

బాబు పాలనంతా మోసం



శ్రీకాకుళం పదో డివిజన్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): చంద్రబాబు ష్యూరిటీ అంటే మోసం గ్యారెంటీగా ఉంటుందన్న విషయాన్ని రాష్ట్ర ప్రజలు గత నలభై ఏళ్లుగా చూస్తున్నారని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి. పద్మావతి అన్నారు. శ్రీకాకుళం నగరంలోని 10వ డివిజన్‌లో కర్రి రంగాజీదేవ్, డి.పి.దేవ్‌ల ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ...మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రూ.10వేలు ఇస్తామని చెప్పి ఏకంగా వలంటీర్ వ్యవస్థనే ఎత్తివేశారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కళింగవైశ్య కుల విభాగం అధ్యక్షుడు అంధవరపు సూరిబాబు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం, పట్టణ అధ్యక్షుడు సాధు వైకుంఠరావు, పట్టణ బీసీ విభాగం అధ్యక్షుడు గద్దిబోయిన కృష్ణారావు, టి.కామేశ్వరి, బేగ్, కింజరాపు రమేష్, పాపారావు, వానపల్లి రమేష్, రమేష్, శ్రీనివాస్, గుజ్జల శాంతేశ్వరరావు, బుంగ సత్యనారాయణ, కృష్ణారావు, గోపాల్, అప్పారావు, బాబురావు, హరి, ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలన మోసాలమయం



గార: వమరవల్లిలో టీడీపీ ఇచ్చిన హామీలపై అవగాహన కల్పిస్తున్న ఎంపీపీ గొండు రఘురామ్, నాయకులు

గార: హామీలివ్వడం గద్దెనెక్కిన తర్వాత ప్రజలను మోసం చేయడమే చంద్రబాబు పరిపాలనని ఎంపీపీ గొండు రఘురామ్ అన్నారు. గురువారం గార మండలం వమరవల్లి పంచాయతీలో బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి బాబు మోసాలను వివరించారు. మేనిఫెస్టో అమలు చేయని చంద్రబాబును నమ్మవద్దన్నారు.

కార్యక్రమంలో సర్పంచ్ రఘు, నాయకులు తమ్మిన అప్పలరాజు, అరవల రామకృష్ణ, పుల్లటి నాగేశ్వరరావు, రౌతు శంకరరావు, శీర సత్యం, అరవల రామారావు, బరాటం నాగరాజు, గుంటు రామచంద్రరరావు, బత్తుల గోవిందరావు, వమరవల్లి వెంకటరావు, గుజ్జల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు. చంద్రబాబు అంటే మోసాలకు బ్రాండ్ అంబాసిడర్ అని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి అన్నారు. తోనంగి పంచాయతీలో మండల పార్టీ అధ్యక్షుడు పీస గోవిందరాజులు అధ్యక్షతన బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. రైతు భరోసా ఎగనామం పెట్టారని, వ్యవసాయ పనులు జరుగుతున్నా యూరియా అందివ్వలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు ముంజేటి కృష్ణమూర్తి, అంధవరపు బాలకృష్ణమూర్తి, పొదిలాపు రామజోగి, అప్పలనాయుడు, వమరవల్లి ఉదయభాస్కరరావు, నగిరెడ్డి ఆనంద్, రాన గురయ్య, ఎర్రన్న రెడ్డి, రాజారావు, అట్టాడ గోపి తదితరులు పాల్గొన్నారు.



తోనంగిలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

రాజు కుటుంబాన్ని ఆదుకోవాలి

శ్రీకాకుళం: ఎంటీఎస్ ఉపాధ్యాయుడు అల్లు రాజు మృతి చెందిన నేపథ్యంలో ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న, ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావు, ఆమదాలవలస మండల శాఖ అధ్యక్షుడు పైడి రమణ డిమాండ్ చేశారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ జలుమూరు మండలం శ్రీముఖలింగం పాఠశాలలో ఎంటీఎస్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న రాజును కంచిలి మండలం జి.ముకుందపురం పాఠశాలకు బలవంతంగా బదిలీ చేయడంతో మానసిక ఒత్తిడికి గురై బుధవారం గుండెపోటుతో మృతి చెందారని పేర్కొన్నారు. రాజు అకాల మరణం చెందడంతో కుటుంబం రోడ్డున పడిందన్నారు.

తక్షణమే బాధిత కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా, రూ.20 వేలు పెన్షన్ మంజూరు చేయాలని కోరారు.